శనివారం 15, జూన్ 2024

ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

# ఆడుకుంటానని వెళ్లి.. బాగ్ అంబర్ పేటలో బాలుడు మిస్సింగ్



ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 41: బయట ఆడుకుంటానని వెళ్లిన బాలుడు అదృశ్యమైన ఘటన అంబర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్ అంబర్ పేట డీడీ కాలనీకి చెందిన చందు కుమారుడు పవన్ కుమార్ (11) స్థానిక స్కూల్లో ఐదవ తరగతి చదువుతున్నాడు..కాగా ఈనెల 12 వ తేదీ సాయంత్రం ఆడుకుంటానని ఇంట్లోంచి బయటకు వెళ్లి ఇప్పటికీ తిరిగి రాలేదు.తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో బాధితులని తండ్రి చందు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు






ఈ స్కూల్ పిల్లల్ని చూస్తుంటే ఆనందంగా ఉంది: రేవంత్ రెడ్డి ఆసక్తికర ట్వీట్.. 2లో



భిన్నత్వాన్ని చూపించేలా ఏపీ సీఎం ప్లాన్.. 10 నుంచి 6 వరకు సచివాలయంలోనే..! 2లో



అమిత్ షా ఎందుకు సీరియస్ అయ్యారో చెప్పిన తమిళిసై... 3లో



శాంతియుత పరిష్కారానికి భారత్ ప్రయత్నాలు కొనసాగుతాయ్ : ప్రధాని మోదీ 3లో









ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/

## తెలంగాణ ఐసెట్ ఫలితాలు వచ్చేశాయ్




ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , జూన్ 14: తెలంగాణలో ఐసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఉన్నతాధికారులు ఈ ఫలితాలను విడుదల చేశారు. 91.92 శాతం విద్యార్థులు ఐసెట్ లో అర్హత సాధించారు. దీంతో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు 71 వేల 647 మంది విద్యార్థులు అర్హత సాధించారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు 2024 జూన్ 5,6 తేదీల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తంగా 86 వేల156 మంది అప్లై చేసుకోగా, 77 వేల 942 మంది పరీక్షకు అటెండ్ అయ్యారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాల్ని ఎంటర్ చేసి ర్యాంక్ కార్డుని డౌన్‌లోడ్ చేసుకో



# ఏపీలో మంత్రులకు శాఖలు కేటాయింపు

## పవన్‌కు పంచాయతీ రాజ్, అనితకు హెూం అఫైర్స్, లోకేశ్‌కు ఐటీ



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ , జూన్ 14: ఆంధ్రప్రదేశ్‌లో మంత్రులకు శాఖల కేటాయింపు జరిగింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం చంద్రబాబు వద్ద సాధారణ పరిపాలన శాఖలతో పాటు శాంతి భద్రతలు తన వద్దే ఉంచుకున్నారు. వంగలపూడి అనితకు హెూం అఫైర్స్, విపత్తు శాఖ కేటాయించారు. పవన్ కల్యాణ్‌కు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా శాఖలు కేటాయించారు.

**శాఖల కేటాయింపు ఇలా..**

1. చంద్రబాబు(సీఎం) - సాధారణ పరిపాలన, శాంతి భద్రతలు
2. పవన్ కల్యాణ్(డిప్యూటీ సీఎం) - పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ
3. లోకేశ్ - మానవ వనరులు, ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీ
4. కింజారపు అచ్చెన్నాయుడు - వ్యవసాయం, పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్యశాఖ
5. కొల్లు రవీంద్ర - గనులు, ఎక్సైజ్ శాఖలు
6. నాదెండ్ల మనోహర్ - పౌర సరఫరాలు
7. పొంగూరు నారాయణ - మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి
8. అనిత వంగలపూడి - హెూం శాఖ, విపత్తు
9. సత్య కుమార్ యాదవ్ - ఆరోగ్యం, కుటుంబ వైద్యారోగ్య శాఖ
10. నిమ్మల రామానాయుడు - వాటర్ రిసోర్స్ డెవలప్‌మెంట్
11. మహ్మద్ ఫరూఖ్ - లా అండ్ జస్టిస్, మైనార్టీ వెల్ఫేర్
12. ఆనం రాంనారాయణ రెడ్డి - దేవాదాయ శాఖ
13. పయ్యావుల కేశవ్ - ఆర్థిక శాఖ, కమర్షియల్ ట్యాక్సెస్, లెజిస్లేటివ్
14. అనగాని సత్యప్రసాద్ - రెవెన్యూ
15. కొలుసు పార్థసారథి - హౌసింగ్, ఐ అండ్ పీఆర్
16. వీరాంజనేయ స్వామి - సోషల్ వెల్ఫేర్
17. గొట్టిపాటి రవికుమార్ - ఎనర్జీ
18. కందుల దుర్గేశ్ - టూరిజం, కల్చర్, సినిమాటోగ్రఫీ
19. గుమ్మడి సంధ్యారాణి - మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ, ట్రైబల్ వెల్ఫేర్
20. బీసీ జనార్థన్ రెడ్డి - రోడ్లు, భవనాలు
21. టీజీ భరత్ - పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్
22. ఎస్ సవిత - బీసీ వెల్ఫేర్, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్ టైల్స్
23. వాసంశెట్టి సుభాష్ - కార్మిక శాఖ
24. కొండపల్లి శ్రీనివాస్ - ఎంఎస్ఎంఈ, సెర్ప్
25. మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి -రవాణా, యూత్ అండ్ స్పోర్ట్స్

కాగా, జనసేన-బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు.. మిత్ర పక్షాలకు మంత్రి పదవులు కేటాయించడంతో పాటు.. కీలక మంత్రిత్వశాఖలు కేటాయించారు.. డిప్యూటీ సీఎం హెూదాను జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఒక్కరికే పరిమితం చేశారు.. 2014-19 మధ్య కాలంలో ఇద్దరికి డిప్యూటీ సీఎం పదవులిచ్చిన చంద్రబాబు.. ఇక, 2019%-%24 మధ్య కాలంలో ఐదుగురికి డిప్యూటీ సీఎం పదవులు ఇచ్చారు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. అయితే, ఇప్పుడు కేబినెట్‌లోకి జనసేన అధినేత పవన్ కల్యాణ్ రావడంతో ఆయన ఒక్కరికే డిప్యూటీ సీఎం పదవిచ్చి గౌరవించారు చంద్రబబు.. పౌర సరఫరాలు వంటి కీలక శాఖను జనసేనకు చెందిన నాదెండ్ల మనోహర్‌కు కేటాయించారు.. చంద్రబాబు పెట్ సబ్జెక్ట్ టూరిజం శాఖను కూడా జనసేనకే ఇచ్చారు ఏపీ సీఎం.. మరోవైపు, కీలకమైన వైద్యారోగ్య శాఖను బీజేపీకి కేటాయించారు టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.

## భిన్నత్వాన్ని చూపించేలా ఏపీ సీఎం ప్లాన్..

## 10 నుంచి 6 వరకు సచివాలయంలోనే..!

- **గత పాలనకు.. ఇప్పటికీ భిన్నత్వాన్ని చూపించాలని భావిస్తున్న చంద్రబాబు**
- **ఇక నుంచి ప్రతీరోజు ఉదయం 10 గంటల నుంచి 6 గంటల వరకు సచివాలయంలోనే ఉండనున్నారట సీఎం**
- **సమయపాలన కచ్చితంగా పాటించాలని ఆయన నిర్ణయం తీసుకున్న చంద్రబాబు**



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ , జూన్ 14: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు.. ఓవైపు కేబినెట్ మంత్రులకు శాఖలు కేటాయించారు.. మరోవైపు సమీక్షలు నిర్వహిస్తున్నారు.. అయితే, గత పాలనకు.. ఇప్పటికీ భిన్నత్వాన్ని చూపించాలని భావిస్తున్నారట సీఎం చంద్రబాబు. ప్రభుత్వ కార్యక్రమాల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు మినహాయిస్తే.. ఇక నుంచి ప్రతీరోజు ఉదయం 10 గంటల నుంచి 6 గంటల వరకు సచివాలయంలోనే ఉండనున్నారట సీఎం చంద్రబాబు. సమయపాలన కచ్చితంగా పాటించాలని ఆయన నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.. ఇక, జిల్లాల్లో, నియోజకవర్గాల్లో కొత్త మంత్రుల పర్యటన పూర్తయ్యాకే తొలి కెబినెట్ భేటీ నిర్వహించే అవకాశం ఉందంటున్నారు.. మరోవైపు.. పోలవరం ప్రాజెక్టు పర్యటన పూర్తయ్యాక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే ఛాన్స్ ఉందంటున్నారు.. ఇక, రెగ్యులర్‌గా సచివాలయానికి రావాలని తనను కలిసిన మంత్రులకు సూచించారు సీఎం చంద్రబాబు. తమ శాఖలపై పట్టు పెంచుకోవాలని సూచించారంట.. అంతే కాదు.. పరిపాలన పరంగా పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలని మంత్రులకు దిశా నిర్దేశం చేస్తున్నారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.

## ఈ స్కూల్ పిల్లల్ని చూస్తుంటే ఆనందంగా ఉంది

- **రేవంత్ రెడ్డి ఆసక్తికర ట్వీట్**
- **మగ్దంపూర్ హైస్కూల్ పిల్లలు రూపాయి ప్రయాణ ఖర్చు లేకుండా స్కూల్‌కు వెళ్తున్నారన్న సీఎం**
- **ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణంతో వారు సంతోషంగా ఉన్నారని వెల్లడి**
- **విద్యార్థినులు ఆధార్ కార్డులు చూపిస్తున్న ఫొటోను ట్వీట్ చేసిన ముఖ్యమంత్రి**

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 14: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర ట్వీట్ చేశారు. రూపాయి ఖర్చు లేకుండా స్కూల్‌కు వెళ్తున్న పిల్లలను చూస్తుంటే తనకు ఎంతో ఆనందంగా ఉందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం మగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలికలను చూస్తుంటే ఆనందంగా ఉందని... గ్రామానికి కిలో మీటర్ దూరంలో ఉన్న పాఠశాలకు రూపాయి ప్రయాణ ఖర్చు లేకుండా వారు వెళ్తున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ పథకం వల్ల తాము ఉచితంగా బస్సెక్కి స్కూల్‌కు వెళ్తున్నామని విద్యార్థినులు తమ చేతిలోని ఆధార్ కార్డులు చూపిస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఓ జర్నలిస్ట్ మిత్రుడు ఈ ఫొటోలు తీసి పంపించారని పేర్కొన్నారు.



# మాజీ మంత్రి మల్లన్నకు మరో షాక్..

- **మామా అల్లుడిపై మరో భూకబ్జా కేసు**
- **మల్లారెడ్డితో పాటు రాజశేఖర్‌రెడ్డిపై 7 సెక్షన్ల కింద కేసులు**
- **పేట్‌బషీరాబాద్‌లో 32 గుంటల స్థలం కబ్జా చేశారని ఆరోపణలు**
- **ఈ సారి సాఫ్ట్?వేర్ ఇంజినీర్ ఫిర్యాదుతో కేసు నమోదు..**



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 14: మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి మరో షాక్ తగిలింది. మల్లారెడ్డిపై పేట్‌బషీర్‌బాద్ పోలీసులు భూకబ్జా కేసు నమోదు చేశారు. మల్లార్ రెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డిపై మొత్తం ఏడు సెక్షన్లతో కేసు నమోదు చేసినట్లు సమాచారం. పేట్ బషీర్ బాద్ లో 32 గుంటల భూమి ఆక్రమణకు గురై నిర్మాణాలు కూల్చివేసినట్లు శేరి శ్రీనివాస్ రెడ్డి అనే సాఫ్ట్ వేర్ ఉద్యోగి పేట్ బషీర్ బాద్ పోలీసులను ఆశ్రయించాడు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు మల్లారెడ్డిపై కేసు నమోదు చేశారు. తాజాగా మల్లార్ రెడ్డి, అల్లుడు రాజశేఖర్ రెడ్డి జోక్యంతో సుచిత్రలో పెద్ద వివాదం చోటుచేసుకుంది. ఈ కేసులో పేట్ బషీర్ బాద్ మల్లారెడ్డిని అరెస్ట్ చేసి జైలుకు తరలించిన విషయం తెలిసిందే. నగర శివారులోని కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్ల గ్రామంలోని సుచిత్ర పరిధిలోని సర్వేనెంబర్ 82, 83లో మాజీ మంత్రి మల్లారెడ్డి, ఇతరుల మధ్య భూ వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. అయితే మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డి మాత్రం రెండున్నర ఎకరాల భూమి తమదేనని వాదిస్తున్నారు. 1.11 ఎకరాల భూమి తమదని మరో 15 మంది చెబుతున్నారు. సర్వే నెం.82లోని స్థలంలో మల్లారెడ్డి, ఆయన అల్లుడు, మరో 15 మంది మధ్య వాగ్వాదం జరిగింది. ఒక్కొక్కరు 400 గజాల చొప్పున గతంలో భూమి కొనుగోలు చేశారని 15 మంది పేర్కొనగా, కోర్టు కూడా తమకు అనుకూలంగా తీర్పునిచ్చింది. అయితే ఈ స్థలంపై కోర్టు ఉత్తర్వులు ఉన్నందున ఆ స్థలంలో ఎలాంటి గొడవలు జరగవద్దని పోలీసులు ఇరువర్గాలకు సూచించారు. అయితే మల్లారెడ్డి అనుచరులు తమను భయపెడుతున్నారని 15 మంది సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భూ వివాదం ఇంకా కొనసాగుతూనే ఉండగా ఇప్పుడు మరో భూవివాదంలో మల్లారెడ్డిపై కేసు నమోదు చేయడంపై సర్వత్రా ఉత్కంఠ నెలకుంది.

## ఢిల్లీలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను కలిసిన బీజేపీ నేతలు

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 14: కేంద్ర విద్యాశాఖ, స్కిల్ డెవలప్మెంట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్ ను హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు డాక్టర్.ఎన్ గౌతమ్ రావు, రాష్ట్ర బిజేపీ ఉపాధ్యక్షులు మాజీ శాసనసభ్యులు చింతల రామచంద్ర రెడ్డి, , రాష్ట్ర సహకోశాధికారి శ్రీనివాస రెడ్డి , సికింద్రాబాద్ పార్లమెంట్ ప్రభారి వీరేల్లి చంద్రశేఖర్, మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు బి. శ్యాంసుందర్ గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిజెపి జాయింట్ కన్వీనర్ ఏడెల్లి అజయ్ కుమార్, ఏడెల్లి అనిల్ కుమార్ తదితరులు ఢిల్లీ శాస్త్రి భవన్లో శుక్రవారం కలసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



### తీహార్ జైలులో
## కవితతో కేటీఆర్ ములాకత్

ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూన్ 14: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తీహార్ జైలులో వున్న ఎమ్మెల్సీ కవితకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిశారు. శుక్రవారం కవితను మర్యాదపూర్వకంగా కలిసారు. అలాగే కవిత ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆమెను కలిసిన అనంతరం కేటీఆర్ హైదరాబాద్‌కు తిరుగు పయనం అయ్యారు. కాగా, ఇటీవల కవితకు ఢిల్లీలోని రూస్ అవెన్యూ కోర్టు జ్యుడీషియల్ రిమాండ్‌ను మరో రెండు వారాల పాటు పొడిగించిన సంగతి తెలిసిందే. ఢిల్లీ లిక్కర్ సీబీఐ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్సీ కవిత సీబీఐ జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు మరో సారి పొడిగించిన విషయం తెలిసిందే. కాగా సీబీఐ దాఖలు చేసిన సప్లిమెంటరీ ఛార్జిషీట్‌ను రౌస్ అవెన్యూ న్యాయస్థానం అంగీకరించింది. ఈ మేరకు సీబీఐ కేసులో ఈ నెల 21 వరకు కవిత జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. మరోవైపు.. కవిత చదువుకోవడానికి కొత్తగా తొమ్మిది పుస్తకాలు కావాలని కోర్టును కోరింది. ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తిని రౌస్ రెవిన్యూ కోర్టు అంగీకరించింది. తదుపరి విచారణను జూన్ 21వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. అదే రోజు సీబీఐ చార్జిషీట్ పరిగణనలోకి తీసుకునే అంశంపై రౌజ్ అవెన్యూ కోర్టు విచారణ జరపనుంది.



## ఏపీలో చంద్రబాబు రాగానే పెన్షన్లు పెంచారు

- **తెలంగాణలో కాంగ్రెస్ హామీలు నీటి మూటలేనని హరీశ్ రావు విమర్శ**
- **191 రోజులు అయినప్పటికీ ఆచరణలో కాంగ్రెస్ విఫలమైందని వ్యాఖ్య**
- **వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలకు పెంచాలని డిమాండ్**

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 14: ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే అన్ని రకాల పెన్షన్లను పెంచారని... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ప్రభుత్వం కూడా తక్షణమే పెంచాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ హామీలు నీటి మూటలే అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 191 రోజులు అయినప్పటికీ ఆచరణలో విఫలమైందన్నారు. వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలకు పెంచాలన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలు అమలు చేస్తామని బాండ్ పేపర్ల మీద రాసిచ్చిందని గుర్తు చేశారు. కానీ హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. ఒడిశాలో ముఖ్యమంత్రి వరికి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3,100కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. వరికి బోనస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరవాలన్నారు. సన్న వడ్లకు మాత్రమే రూ.500 బోనస్ ఇచ్చి చేతులు దులుపుకంటామంటే కుదరదన్నారు.



## ప్రపంచంలోనే మొట్టమొదటి ఎయిర్ టాక్సీ అందుబాటులోకి.. ఎక్కడంటే..

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 14: శుక్రవారం నుండి ప్రారంభమయ్యే ఈ సంవత్సరం హజ్ సీజన్‌లో యాత్రికుల కోసం స్వీయ డ్రైవింగ్ ఎయిర్ టాక్సీ సేవను ప్రారంభించింది. సౌదీ రవాణా మరియు లాజిస్టిక్ సేవల మంత్రి, సలేహ్ బిన్ నాసర్ అల్ జాసర్, పౌర విమానయాన ప్రెసిడెంట్ అబ్దుల్ అజీజ్ అల్ దుయిలేజ్, డిప్యూటీ మంత్రి డాక్టర్ రుమైహ్ అల్ రుమైహ్, ఇతర అధికారుల సమక్షంలో ఈ సేవను ప్రారంభించారు. ఈ కార్యక్రమం లాంచ్ సందర్భంగా అల్ జాసర్ మాట్లాడుతూ.., ఈ విమానం ప్రపంచంలోనే మొట్టమొదటి ఎయిర్ టాక్సీ అని, పౌర విమానయాన అథారిటీ లైసెన్స్ పొందింది. స్మార్ట్ మొబిలిటీని పెంపొందించడానికి అలాగే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల ఉపాధిని ప్రారంభించే చట్టాలు, వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి మంత్రిత్వ శాఖ కృషి చేస్తోందని ఆయన తెలిపారు. యాత్రికులను రవాణా చేయడం, అత్యవసర కదలికలను సులభతరం చేయడం, వైద్య పరికరాలను రవాణా చేయడం మరియు సరుకు రవాణా ద్వారా లాజిస్టికల్ సేవలను అందించడం లాంటి వాటిలో ఎయిర్ టాక్సీ అందించగల సేవలను కూడా సమీక్షించారు.




## అమిత్ షా ఎందుకు సీరియస్ అయ్యారో చెప్పిన తమిళిసై



ఇయ్యాల్టి న్యూస్, తమిళనాడు, జూన్ 14: ఏపీ సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవం చేసిన సమయంలో.. ఆ స్టేజ్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా.. మాజీ గవర్నర్ తమిళిసైకి క్లాసు పీకుతున్నట్లు ఓ వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే. స్టేజ్ మీదకు వస్తూ విషెస్ చెబుతున్న సమయంలో.. తమిళిసైపై అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరూ ఏదో మాట్లాడుకున్నారు. ఆ టైంలో కొంత ఆగ్రహంగా ఉన్న అమిత్ షా తన చూపుడు వేలు చూపిస్తూ సీరియస్ అయ్యారు. సరే అంటూ తమిళిసై తల ఊపుకుంటూ వెళ్లారు. ఆ ఘటన పట్ల సోషల్ మీడియాలో పుకార్లు వ్యాపించాయి. తమిళనాడు బీజేపీ నేత అన్నామలై, తమిళిసై మధ్య ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తున్నట్లు ఆరోపణలు వినిపించాయి. ఆ వీడియోపై వదంతులు వ్యాపించడంతో ఇవాళ బీజేపీ నేత సౌందర్యరాజన్ క్లారిటీ ఇచ్చారు. తన ఎక్స్ అకౌంట్‌లో ఆమె ఆ రోజు జరిగిన సంభాషణ వివరాలను వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారి అమిత్ షాను కలిశానని, ఎన్నికల తర్వాత చేపట్టాల్సిన అంశాల గురించి చర్చించుకున్నట్లు ఆమె తెలిపారు. ఎన్నికల సమయంలో జరిగిన అంశాల గురించి తెలియజేస్తున్న సమయంలో.. షా తనకు దిశానిర్దేశం చేశారన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ విస్తృత స్థాయిలో రాజకీయ, సేవ కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని షా సూచించినట్లు ఆమె చెప్పారు. వీడియో ఆధారంగా అనవసర ఆరోపణలు వస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. తాజా లోక్‌సభ ఎన్నికల్లో దక్షిణ చెన్నై సీటు నుంచి బీజేపీ అభ్యర్థిగా తమిళిసై సౌందర్యరాజన్ పోటీ చేశారు. డీఎంకే అభ్యర్థి తంగపాండియన్ చేతిలో ఆమె ఓటమిపాలయ్యారు. తమిళనాడు బీజేపీ యూనిట్‌లో అంతర్గత కుమ్ములాట జరుగుతోందన్న ఊహాగానాలకు తెరదింపుతూ తమిళిసై పోస్టు పెట్టారు. పార్టీలో నేరస్థులు ఉన్నారని, అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుంటే గెలిచేవాళ్లమని తమిళిసై ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

## నీట్ వ్యవహారంపై కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు

### మోదీ మౌనం వీడాలన్న ఖర్గే



ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ , జూన్ 14: నీట్ వ్యవహారం దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఆయా రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులు, నాయకులు పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనలు చేపడుతున్నారు. నీట్–యూజీ 2024 పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. ఈ వ్యవహారంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎందుకు మౌనంగా ఉన్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రశ్నించారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఫోరెన్సిక్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దీంతో లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడుతుందని తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీల ద్వారా నీట్ కుంభకోణాన్ని కప్పిపుచ్చడం ప్రారంభించిందని మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ కానప్పుడు.. బీహార్‌లో పేపర్ లీక్ పేరిట 13 మందిని ఎందుకు అరెస్టు చేశారు? అని ఖర్గే నిలదీశారు. గుజరాత్‌లోని గోధ్రాలో చీటింగ్ రాకెట్ గుట్టురట్టు కాలేదా?, మోడీ ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. దాదాపు 24 లక్షల మంది యువత ఆకాంక్షలను తుంగలో తొక్కారని.. మార్కులు, ర్యాంకులను భారీగా రిగ్గింగ్ చేసిందన్నారు. మెరిట్ విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పొందకుండా చేసేందుకే కేంద్రం ఈ ఆటలాడినట్లు కనిపిస్తోందని ఖర్గే ఆరోపించారు. నీట్ వ్యవహారం.. 'వ్యాపమ్ 2.0' అని పార్టీ మీడియా ఇన్‌ఛార్జి పవన్ ఖేడా విమర్శలు చేశారు.

## రన్నింగ్ ట్రైన్‌పైకెక్కి.. ఇంత రిస్క్‌తో ఏం పని చేస్తున్నారంటే...?..



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 14: ఎంతోమంది ప్రయాణీకులు ఇండియన్ రైల్వేస్‌ను తమ ప్రయాణాలకు ప్రతి నిత్యం వినియోగిస్తుంటారు. కొందరు ఎంచక్కా తమకు రిజర్వ్ చేసిన బెర్త్‌ల్లో ప్రయాణిస్తుంటే.. మరికొందరు రిస్క్ చేసి మరీ రైలు ప్రయాణాలు చేస్తారు. ఇక ఇంకొందరైతే.. సెల్ఫీల పిచ్చితో ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. ఇదంతా ఒక రకమైతే.. ఇప్పుడు మేము చూపించబోయే ప్రయాణీకులు మరో రకం. వీరు ఏం చేశారో చూస్తే.. మీ గుండె జల్లుమనడం ఖాయం. వైరల్ వీడియో ప్రకారం.. అత్యంత ప్రమాదకర రీతిలో కొందరు ఏకంగా రైలు టాప్ ఎక్కి మరీ ప్రయాణిస్తున్నారు. అంతేకాదు ఏకంగా అక్కడే నిద్రపోతున్నారు. రైలు వేగంగా వెళ్తోందని.. తాము టాప్ ఎక్కి పడుకున్నామన్న సోయి లేకుండా.. నిశ్చింతగా నిద్రపోతున్నారు. ఇక ఆ టాప్ ఎక్కి నిద్రపోయిన వారిలో పురుషులు మాత్రమే కాదు, మహిళలు, టీనేజర్లు సైతం ఉన్నారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతుండగా.. దీనిని చూసి నెటిజన్లు షాకవుతున్నారు. ప్రయాణించడానికి ఇంత రిస్క్ అవసరమా.? లేక కావాలనే వీరిది బరితెగింపా అంటూ నెటిజన్లు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ వీడియోకు లక్షల్లో వ్యూస్ వచ్చిపడుతున్నాయి. లేట్ ఎందుకు మీరూ ఓ లుక్కేయండి.

## రీల్ మోజుతో రిస్క్ చేశాడు.. సీన్ కట్ చేస్తే.... విషాదాంతం



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 14: ఏనుగుతో రీల్ చేసేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తి కోరి చావును కొనితెచ్చుకున్నట్టయింది. అతడు ఆ ఏనుగు భయపెట్టి దానిని తరిమేందుకు యత్నించాడు. కానీ, అది అడవి ఏనుగు.. ఆగ్రహంతో ఊగిపోయింది. రెచ్చిపోయిన గజరాజు.. ఘీంకారం చేస్తూ.. అతని వెంటపడింది. తొండంతో విసిరి నేలకేసి కొట్టింది. అంతటితో ఆగలేదు ఆ ఏనుగు.. అతన్ని తన కాలుతో తొక్కి చంపేసింది. దీనికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ షాకింగ్ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నోర్ జిల్లాలో చోటు చేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళితే..అడవి నుంచి బయటపడిన ఒక ఏనుగు ఆ జిల్లాలోని పలు గ్రామాల్లో సంచరించింది. గురువారం ఉదయం హాబీబావాలా గ్రామంలోకి ప్రవేశించింది. దీంతో ఏనుగును చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. ఈ క్రమంలోనే బాగ్దాద్ అన్సార్ గ్రామానికి చెందిన 30 ఏళ్ల ముర్సాలీన్ ఆ ఏనుగుతో రీల్ చేసేందుకు ప్రయత్నించాడు. ఏనుగును భయపెట్టి తరిమేందుకు దాని సమీపానికి వెళ్లాడు. ఆగ్రహించిన ఏనుగు అతడి వెంటపడింది. దీంతో ఆ వ్యక్తితోపాటు అక్కడున్న జనం భయంతో పరుగులు తీశారు. అయితే ముర్సాలీన్‌ను సమీపించిన ఏనుగు కాళ్లతో అతడ్ని తొక్కింది. తొండంతో 25 అడుగుల ఎత్తుకు విసిరికొట్టింది. ఏనుగు దాడిలో తీవ్రంగా గాయపడిన అతడ్ని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.

## జీ7 శిఖరాగ్ర సదస్సు వేళ.. ఇటలీ పార్లమెంట్‌లో కొట్టుకున్న ఎంపీలు



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 14: జీ7 శిఖరాగ్ర సదస్సు వేళ ఇటలీ లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఆ దేశ పార్లమెంట్ లో ఉద్రిక్త పరిస్థితి వెలుగుచూసింది. ఓ బిల్లు విషయంలో అధికార, విపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో ప్రతిపక్ష నేతకు ఒకరికి గాయాలైనట్లు తెలుస్తోంది. సదరు సభ్యుడిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఇటలీలోని కొన్ని ప్రాంతాలకు ఆర్థికంగా మరింత స్వేచ్ఛ కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లును అధికార కూటమి సభలో ప్రవేశపెట్టింది. ప్రజల నుంచి సేకరించిన పన్నుల వినియోగంపై ఆయా ప్రాంతాలకు మరింత స్వేచ్ఛను ఇచ్చేందుకు ఈ బిల్లును రూపొందించారు. దీన్ని ప్రతిపక్ష సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎంపీ లియోనార్డో డోనో పార్లమెంట్‌లో ఇటలీ జాతీయ జెండాను ప్రదర్శించే ప్రయత్నించారు. ఈ క్రమంలో సభలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చట్ట సభ్యుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు దాడి చేసుకుని కొట్టుకున్నారు. సభలో గందరగోళానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. కాగా, ప్రస్తుతం ఇటలీలో జీ7 శిఖరాగ్ర సదస్సు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సదస్సుకు హాజరయ్యేందుకు అగ్రరాజ్యం అమెరికా సహా వివిధ దేశాధినేతలు ఇప్పటికే అక్కడికి చేరుకున్నారు. ఇలాంటి సమయంలో నేతలు ఇలా విచక్షణ కోల్పోయి, హుందాతనం మరిచి పరస్పరం దాడులకు దిగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటన ఇటలీ ఐక్యతను దెబ్బతీస్తుందని స్థానిక నేతలు వ్యాఖ్యానించారు. కాగా, ఇక గురువారం నుంచి శనివారం వరకూ జరగనున్న జీ7 శిఖరాగ్ర సమావేశాల్లో యూరోపియన్ యూనియన్, మరో ఆరు దేశాల నేతలు పాల్గొననున్నారు. ఈ సమావేశాల కోసం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహా పలువురు ఇప్పటికే ఇటలీ చేరుకున్నారు.

## కువైట్ అగ్నిప్రమాదం.. కేరళ చేరుకున్న 45 మంది భారతీయుల మృతదేహాలు



ఇయ్యాల్టి న్యూస్, కేరళ, జూన్ 14: గల్ఫ్ దేశం కువైట్‌లో ఈ నెల 12న (బుధవారం) ఓ నివాస భవనంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో మరణించిన 45 మంది భారతీయుల మృతదేహాలను తీసుకువచ్చిన ప్రత్యేక ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విమానం ఈరోజు కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగింది. కువైట్‌లోని మంగాఫ్ ప్రాంతంలోని లేబర్ హౌసింగ్ ప్రాంతం నుండి ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాలను వెంటనే స్వదేశానికి తరలించేందుకు భారత ప్రభుత్వం ఈ ప్రత్యేక ఐఏఎఫ్ విమానాన్ని ఏర్పాటు చేసింది. అంతకుముందు కువైట్‌లోని భారత ఎంబసీ ఒక ప్రకటన విడుదల చేసింది. "కువైట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించిన 45 మంది భారతీయుల మృతదేహాలతో కూడిన ప్రత్యేక ఐఏఎఫ్ విమానం జూన్ 13న సాయంత్రం కొచ్చికి బయలుదేరింది. ఈ విమానం జూన్ 14 ఉదయం కొచ్చికి చేరుకునే అవకాశం ఉంది. ఆ వెంటనే ఢిల్లీకి వెళ్తుంది" అని రాయబార కార్యాలయం తన ప్రకటనలో పేర్కొంది. అలాగే మృతదేహాలను త్వరగా స్వదేశానికి రప్పించడానికి కువైట్ అధికారులతో సమన్వయం చేసిన విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ విమానంలో ఉన్నారని ఎంబసీ పేర్కొంది. అంతేగాక ఈ విషాద ప్రమాదం తరువాత అధికారిక మరణాల సంఖ్యను కూడా ఎంబసీ వెల్లడించింది. ప్రమాదం సంభవించిన హౌసింగ్ భవనంలో ఉన్న మొత్తం 176 మంది భారతీయ కార్మికులలో 45 మంది చనిపోయారని, మరో 33 మంది గాయపడ్డారని తెలిపింది. క్షతగాత్రులు ప్రస్తుతం కువైట్‌లోని వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించింది. ఇక మృతుల్లో కేరళకు చెందిన వారు 23 మంది ఉంటే.. తమిళనాడుకు చెందిన వారు ఏడుగురు ఉన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు ముగ్గురు, కర్ణాటకకు చెందిన వారు ఇద్దరు ఉన్నారని స్పష్టం చేసింది. దీంతో పాటు బీహార్, పంజాబ్, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఝార?ండ్, హర్యానా రాష్ట్రాలకు చెందిన ఒక్కొక్కరు చొప్పున ఉన్నట్లు తెలిపింది.

## జో బైడెన్‌కి అసలు ఏమైంది..జీ-7 కోసం వెళ్లి వింత ప్రవర్తన.. వార్త వైరల్..




ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 14: ఇటలీ వేదిక జీ–7 సమ్మిట్ జరుగుతోంది. ఆ దేశంలోని అపులియా ఇందుకు వేదిక కాబోతోంది. ఇప్పటికే సభ్యదేశాలైన అమెరికా, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, కెనడాల దేశాధినేతలు ఇటలీ చేరుకున్నారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ వీరిందరిని సాధారంగా ఆహ్వానించారు. మరోవైపు మెలోనీ ప్రధాని నరేంద్రమోడీకి కూడా ఆహ్వానం పంపారు. నిన్న మోడీ ఇటలీ బయలుదేరారు. ఇదిలా ఉంటే, ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రవర్తించిన తీరు ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా వైరల్ అయింది. ఫోటోగ్రాఫ్ కోసం సభ్యదేశాల దేశాధినేతలు ఫోజ్ ఇచ్చే సమయంలో వారి నుంచి దూరంగా వెళ్లిన బైడెన్ అభివాదం చేయడం వీడియోలో కనిపించింది. బైడెన్ వేరే వైపు వెళ్లి థంప్సప్ చూపించడం కనిపిస్తోంది. అయితే, అటువైపు ఎవరూ ఉండటం కనిపించలేదు. ఆ తర్వాత ఇటలీ ప్రధాని జార్జియా మెలోని బైడెన్ వద్దకు వచ్చి చెప్పడంతో ఇతర దేశాధినేతలతో కలిసి ఫోటోకు ఫోజ్ ఇవ్వడం చూడొచ్చు. ఇటీవల బైడెన్‌ని ప్రతిపక్ష రిపబ్లిక్ పార్టీ తీవ్రంగా ట్రోల్ చేసింది. వైట్‌హౌజ్‌లో సంగీత ప్రదర్శన అయినపోన తర్వాత దాదాపు ఒక నిమిషం పాటు కదలకుండా ఉండిపోవడంపై ఎగతాళి చేసింది. ఇది జరిగిన తర్వాత ప్రస్తుతం ఇటలీలో మరో ఘటన చోటు చేసుకుంది. జోబైడెన్ ఇలా తడబడటం ఇదే తొలిసారి కాదు. ఫిబ్రవరిలో, అధ్యక్షుడు ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ పేరును మాజీ నాయకుడు ఫ్రాంకోయిస్ మిత్రాండ్‌గా పిలిచారు. అతను మరణించి దాదాపుగా 30 ఏళ్లు అయింది. మరో సందర్భంలో వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్‌ని ప్రెసిడెంట్‌గా సంబోధించాడు.

## చేతిలో బీర్ బాటిల్‌తో.. ప్రభుత్వ వాహనంపై నిల్చొని అర్ధనగ్నంగా డ్యాన్సులు..



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 14: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో కొందరు యువకులు వీరంగం సృష్టించారు. అర్ధరాత్రి నడి రోడ్లపై అర్ధనగ్నంగా డ్యాన్స్ చేస్తూ కనిపించారు. అందులోని ఓ వ్యక్తి చేతిలో బీర్ బాటిల్ పట్టుకుని ప్రభుత్వ వాహనంపై నిల్చొని డ్యాన్స్ చేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. సుమారు 10 నుంచి 15 మంది వ్యక్తులు నోయిడా రోడ్డులో వీరంగం సృష్టించారు. ఓ చోట మూడు కార్లను ఆపి చొక్కాలు లేకుండా డ్యాన్సులు చేశారు. అదే సమయంలో 'భారత్ సర్కార్' అని రాసి ఉన్న వాహనంపై ఓ వ్యక్తి బీరు బాటిల్ చేతపట్టుకుని డ్యాన్స్ చేశాడు. అంతటితో ఆగకుండా బీరును కింద డ్యాన్స్ చేస్తున్న వారిపై వెదజిమ్ముతూ కనిపించాడు. వీరంతా ఏదో సెలబ్రేషన్స్ చేసుకుంటున్నట్లుగా వీడియో చూస్తుంటే అర్థమవుతోంది. కారు బ్యానెట్‌పై ఓ కేకు కూడా కనిపించింది. ఇందుకు సంబంధించిన వీడియోని 'నోయిడా వీధుల్లో బహిరంగంగా మద్యం సేవించి గూండాయిజం చేస్తున్నారు. వాహనంపై భారత్ సర్కార్ అని కూడా రాసి ఉంది. ఈ వ్యక్తులు ఏ ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్నారో..?' అనే క్యాప్షన్‌తో ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది. వీడియోపై స్పందించిన నోయిడా పోలీసులు కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. వీడియోలోని వ్యక్తులను అరెస్ట్ చేసే ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. త్వరలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గౌతమ్ బుద్ధ్ నగర్ పోలీస్ కమిషనరేట్ తెలిపింది.

## శాంతియుత పరిష్కారానికి భారత్ ప్రయత్నాలు కొనసాగుతాయ్ : ప్రధాని మోదీ



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 14: రష్యా–ఉక్రెయిన్ దేశాల మధ్య శాంతియుత పరిష్కారం భారతదేశం ప్రయత్నాలు కొనసాగుతూనే ఉంటాయని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. జీ–7 దేశాల 50వ సదస్సులో పాల్గొనేందుకు ఇటలీకి వెళ్లిన ప్రధాని మోదీ.. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఇరుదేశాల ద్వైపాక్షిక అంశాలపై వారు చర్చించారు. రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు భవిష్యత్తులో అనుసరించాల్సిన విధానాలపై ఇద్దరి మధ్య చర్చ జరిగింది. అదేవిధంగా రష్యా–ఉక్రెయిన్ యుద్ధంపై కూడా నేతలిద్దరూ ఒకరి అభిప్రాయాలను ఒకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా రష్యా–ఉక్రెయిన్ నడుమ ఉద్రిక్తతలకు పరిష్కారంపై భారతదేశం స్టాండ్‌ను ప్రధాని వివరించారు. రష్యా–ఉక్రెయిన్ దేశాల మధ్య శాంతి నెలకొనాలనే తాము కోరుకుంటున్నామని.. చర్చల ద్వారా, దౌత్య మార్గాల ద్వారా శాంతియుత పరిష్కారం దక్కాలని తాము భావిస్తున్నామని ప్రధాని మోదీ జలెన్‌స్కీకి తెలియజేశారు. సమావేశానికి ముందు నేతలిద్దరూ కలుసుకోగానే ఒకరినొకరు గట్టిగా కౌగిలించుకుని తమ మధ్య ఆప్యాయతను చాటారు. జెలెన్‌స్కీతో సమావేశానికి ముందు ప్రధాని మోదీ.. ఫ్రాన్స్ అధ్యక్షుడి ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌తో భేటీ అయ్యారు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/
చూసి ముర్వాలే

## రేవ్ పార్టీ కేసు.. జైలు నుంచి విడుదలైన నటి హేమ



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 14: ప్రముఖ సినీ నటి హేమ బెంగళూరు జైలు నుంచి విడుదలయ్యారు. కోర్టు ఆమెకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడంతో శుక్రవారం ఆమె విడుదలయ్యారు. బెంగళూరు రేవ్ పార్టీ కేసులో సినీ నటి హేమను బెంగళూరు సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకున్నారు.హేమ వద్ద ఎలాంటి డ్రగ్స్ దొరకలేదని, అలాగే ఘటన జరిగిన పది రోజులకు వైద్య పరీక్షలు నిర్వహించారని ఆమె తరఫు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. అలాగే డ్రగ్స్ తీసుకున్నట్లు పోలీసులు సాక్ష్యాలు చూపించలేకపోయారని పేర్కొన్నారు. అయితే ఆమె పార్టీలో పాల్గొన్నట్లు చూపే ఆధారాలను సీసీబీ కోర్టుకు అందించింది. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం హేమకు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. దీంతో ఆమె ఈరోజు విడుదలయ్యారు.



పోరగాళ్లంతా ఆమెనే చూడాలె...

## రాధిక అక్క చీరకడితే అట్లుంటది మరి!

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 14: నేహా శెట్టి ఎన్ని సినిమాల్లో నటించినా డీజే టిల్లులో రాధిక క్యారెక్టర్ మాత్రం ఎప్పటికీ గుర్తుండి పోతుంది. అందుకే నేహ ఏ పిక్స్ షేర్ చేసినా ఏమున్నావ్ రాధిక అంటారు నెటిజన్లు.





## రవితేజ మెడకు ఏమైంది..? తీవ్రమైన నొప్పితో షూటింగ్.. హరీష్ శంకర్ పోస్ట్ వైరల్..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 14: మాస్ మహారాజ రవితేజ ప్రస్తుతం మిస్టర్ బచ్చన్ సినిమా చేస్తున్నాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణంలో హరీష్ శంకర్ దర్శకత్వంలో రవితేజ మిస్టర్ బచ్చన్ సినిమా తెరకెక్కుతుంది. ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ప్రస్తుతం రవితేజ షూటింగ్ లో ఉన్నాడు. అయితే తాజాగా హరీష్ శంకర్ చేసిన పోస్ట్ వైరల్ గా మారింది.హరీష్ శంకర్ తాజాగా ఓ ఆసక్తికర ఫోటో షేర్ చేసాడు. ఈ ఫొటోలో.. రవితేజ మెడ నొప్పి తగ్గడానికి మెడ మీద బ్యాండ్ పెట్టుకొని కూర్చోగా హరీష్ శంకర్ పక్కనే అది పట్టుకొని కూర్చున్నాడు. ఈ ఫోటో షేర్ చేస్తూ.. మాస్ మహారాజ రవితేజ డెడికేషన్ కి హ్యాట్స్ ఆఫ్. తీవ్రమైన మెడ నొప్పితో బాధపడుతున్నా షూటింగ్ చేస్తున్నారు. థ్యాంక్యూ అన్నయ్య. ప్రతి రోజు మమ్మల్ని ఇన్‌స్పైర్ చేస్తావు అని పోస్ట్ చేసాడు. దీంతో హరీష్ శంకర్ పోస్ట్ వైరల్ గా మారింది. రవితేజ మెడకు ఏమైంది? రవితేజ మెడ నొప్పికి కారణమేంటి అంటూ కొంతమంది అభిమానులు అడుగుతుండగా మరి కొంతమంది తీవ్రమైన నొప్పి ఉన్నప్పుడు రెస్ట్ తీసుకోవచ్చు కదా అంటుంటే, ఇంకొందరు రవితేజ డెడికేషన్ కి హ్యాట్స్ ఆఫ్ అంటున్నారు. సినిమా కోసం రవితేజ ఎంతగా కష్టపడతారో అందరికి తెలిసిందే.

## సిల్వర్ స్క్రీన్ పై కన్నా.... సోషల్ మీడియాలోనే దివి సందడెక్కువ



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 14: సిల్వర్ స్క్రీన్ పై కన్నా సోషల్ మీడియాలోనే ఎక్కువగా సందడి చేసే దివి... ఒంపుసొంపుల ఫొటోస్ తో హీటెక్కిస్తుంటుంది. లేటెస్ట్ గా మాత్రం కొన్ని పిక్స్ షేర్ చేసింది.

## బట్టలు విప్పేసిన టాలీవుడ్ సీత.. సినిమాల్లో డీసెంట్.. ఈ ఫొటోల్లో మాత్రం!



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 14: సోషల్ మీడియాలోనూ మృణాల్ ఠాకూర్ తెగ సందడి చేస్తోంది. ఇందులో భాగంగానే తాజాగా కొన్ని పిక్స్ వదిలింది. వాటిపై మీరు కూడా ఓ లుక్కేయండి మరి!



## హరోమ్ హర బ్యూటీ అక్షర గౌడ హాట్ ఫోటోలు.. మీరెప్పుడు చూడని బికినీ అందాలతో

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 14: హరోమ్ హర బ్యూటీ అక్షర గౌడ తాజా హాట్ ఫోటోలు నెట్టింట్లో వైరల్ గా మారాయి.. ఎప్పుడూ చూడని అందాల పిక్స్ అదరగొడుతున్నాయి.



## కన్నప్ప టీజర్ వచ్చేసింది..శివుడు ఎవరో తెలుసా?

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 14: మంచు విష్ణు డ్రీం ప్రాజెక్టు 'కన్నప్ప' సినిమాని శరవేగంగా షూట్ చేస్తున్న సంగతి తెలిసిందే. న్యూజిలాండ్ అడవులతో పాటు, రామోజీ ఫిలిం సిటీలో సెట్స్ వేసి ఈ సినిమా షూటింగ్ చేశారు. మోహన్ బాబు ఈ సినిమాని దాదాపు 150 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిస్తున్నారు. బాలీవుడ్ డైరెక్టర్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న కన్నప్ప సినిమాలో మధుబాల, ప్రభాస్, నయనతార, మోహన్ లాల్, శివరాజ్ కుమార్, అక్షయ్ కుమార్.. ఇలా చాలా మంది స్టార్స్ నటిస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించారు.ఇప్పటికే కన్నప్ప సినిమా ప్రమోషన్స్ భారీగానే చేస్తున్నారు. ఆల్రెడీ కాన్స్ ఫిలిం ఫెస్టివల్ లో కన్నప్ప సినిమా టీజర్ ప్లే చేశారు. తాజాగా కన్నప్ప సినిమా టీజర్ రిలీజ్ చేశారు. అలాగే టీజర్ లాంచ్ ఈవెంట్ ని గ్రాండ్ గా నిర్వహించారు. దీంతో ఈ టీజర్ లోని కొన్ని షాట్స్ వైరల్ అవుతున్నాయి. కన్నప్ప సినిమాలో శివుడు కచ్చితంగా ఉంటాడని తెలిసిందే. దీంతో కన్నప్పలో ప్రభాస్ శివుడుగా నటిస్తున్నాడని గతంలో వార్తలు వచ్చాయి. అయితే తాజాగా చూపించిన టీజర్ ప్రకారం అక్షయ్ కుమార్ శివుడిగా నటించినట్టు తెలుస్తుంది. అలాగే టీజర్ లో ప్రభాస్ కళ్ళని చూపిస్తూ ఓ షాట్ వేశారు. ఇక కన్నప్పని ఓ వీరుడిగా చూపిస్తు యుద్ధ సన్నివేశాలతో టీజర్ ని అదరగొట్టేసారు. మీరు కూడా టీజర్ ని చూసేయండి..

Published by: Rathnasri Latha on Behale of RRR Media Patel Nagar chowrasta.. Amberpet.. Hyderabad.. Telangana. 500013 cell: 888643 1510, 9949 152838